ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
3★
సోమవారం 28 అక్టోబరు 2024



న్యూస్ బాక్స్

నేడు మంత్రి ప్రర్యటన

మంథని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మంథని డివిజన్‌లో సోమవారం మంత్రి శ్రీధర్‌బాబు పర్యటించనున్నట్లు పీఏ ఆకుల చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. ఉదయం 8గంటలకు సింగరేణి సంస్థ సెంటినరీకాలనీలో ఏర్పాటుచేయనున్న ఏకో పార్కుకు శంకుస్థాపన, ఉదయం 9 గంటలకు స్థానిక మార్కెట్‌యార్డులో, మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభిస్తారని తెలిపారు. 10 గంటలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన ప్రభుత్వ ప్రైవేట్ విద్యార్థుల ఉచిత డెంటల్ క్యాంపును మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభిస్తారని తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ముత్తారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న చల్ల సమ్మయ్య అనే బీఆర్‌ఎస్ నాయకున్ని ఆదివారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. అనారోగ్యం కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి, సింగిల్ విండో మాజి చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ ఎంపీపీ హత్య చంద్రమౌళి పలువురు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటా సభ్యత్వ నమోదు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రధాని నరేంద్ర మోదీకి వస్తున్న ఆదరణ చూసి బీజేపీ సభ్యత్వం రోజు రోజుకు పెరుగుతుందని సభ్యత్వ నమోదు కన్వీనర్ క్యాతం వెంకటరమణ అన్నారు. ఆదివారం 30వ డివిజన్ సీతానగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జక్కుల నరహరి, గుండబోయిన భూమయ్య, పంగ రవి, శ్యామ్ పాల్గొన్నారు.

- రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు...
- జిల్లా అంతా రుడా పరిధిలోకే...
- నాలుగు నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు...
- రామగుండం కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీలు, 198గ్రామాలకు విస్తరణ...
- జీఓ 165ద్వారా నోటిఫికేషన్ జారీ



రామగుండం నగరం

అభివృద్ధి వైపు అడుగులు

కోల్‌సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అర్బన్ తెలంగాణ-అభివృద్ధి నమునాలో భాగంగా ప్రభుత్వం జిల్లాలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసింది. రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) పేర అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో నెం.165జారీ చేస్తూ నోటిఫికేషన్ ఇచ్చింది. మున్సిపల్ కార్యదర్శి దాన కిశోర్ జీవో జారీ చేశారు. జిల్లాలోని రామగుండం నగరపాలక సంస్థ, మంథని, పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు, జిల్లాలోని 198గ్రామ పంచాయతీలను 'రుడా' పరిధిలోకి తీసుకువచ్చారు. ఎన్నికల్లో రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసింది. 'రుడా'ను ఏర్పాటుచేయాలంటూ రామగుండం శాసనసభ్యులు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మంత్రి శ్రీధర్‌బాబు ద్వారా పలుమార్లు ముఖ్యమంత్రికి విన్నవించారు. ప్రభుత్వం కూడా అర్బన్ తెలంగాణ అభివృద్ధి నమూన నినాదంతో ముందుకుపోతోంది. దీనిలో భాగంగా రాష్ట్రంలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నది. జిల్లా నుంచి ఒత్తిడి మేరకు ప్రతిపాదన పంపాల్సిందిగా ప్రభుత్వం సెప్టెంబరు 23న డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ కలెక్టర్‌ను ఆదేశించింది. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ శాఖలు, మున్సిపాలిటీల అధికారులతో చర్చించి ప్రభుత్వానికి ప్రతిపాదన చేశారు. ఈమేరకు అక్టోబరు 4న డైరెక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి నివేదించింది. దీన్ని పరిశీలించిన ప్రభుత్వం రుడా ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది..

• కలెక్టర్ చైర్మన్‌గా కమిటీ..

కలెక్టర్ చైర్‌పర్సన్‌గా మరో నలుగురు సభ్యులతో అర్బన్ డెవలప్‌మెంట్ కమిటీ నిర్మాణం చేస్తూ నోటిఫికేషన్-2 జారీ చేశారు. కలెక్టర్ చైర్మన్, స్థానిక సంస్థ అదనపు కలెక్టర్ వైస్‌చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ సెక్రటరీ, ఆర్థికశాఖ నుంచి ఒకరు సభ్యులుగా ఉండనున్నారు. మున్సిపల్ డైరెక్టర్, టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్లు సభ్యులుగా ఉంటారు. ప్రభుత్వం పాలకవర్గాన్ని ఏర్పాటు చేసేంత వరకు ఈ కమిటీ కొనసాగనున్నది.

• 14 మండలాలు 'రుడా' పరిధిలోకే..

జిల్లాలోని మంథని, పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాల పరిధిలో 'రుడా' విస్తరించి ఉంటుంది. రామగుండం నగరపాలక సంస్థ పెద్దపల్లి, మంథని సుల్తానాబాద్ మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని 14మండలాల్లోని 198గ్రామాలు 'రుడా' పరిధిలోకి రానున్నాయి. ధర్మారం, పాలకుర్తి, అంతర్గాం, పెద్దపల్లి, జూలపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్, ఓదెలు, శ్రీరాంపూర్, రామగిరి, కమాన్‌పూర్, మంథని ముత్తారం, మంథని మండలాల్లోని గ్రామాలు 'రుడా' పరిధిలోకి వస్తాయి. కొత్తగా ఏర్పడిన ఎండపెల్లి మండలం జగిత్యాల జిల్లా పరిధిలో ఉన్నా మండల పరిషత్‌పరంగా పాలకుర్తి మండలంలోనే ఉన్నది. దీని పరిధిలోని ముంజంపల్లి,

మిగతా 6వ పేజీలో...

'రుడా'తో జిల్లా మరింత అభివృద్ధి

- రామగుండం అభివృద్ధికి రూ.260కోట్ల నిధులు
- మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో ముందుకు..
- ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, అక్టోబరు 27: రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్(రుడా) ఏర్పాటుతో రామగుండంతో పాటు జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. రుడా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రుడా ఏర్పాటుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రామగుండాన్ని మున్సిపాలిటీగా, కార్పొరేషన్ అప్‌గ్రేడ్ చేసింది కాంగ్రెస్ పార్టీయేనని, ఇప్పుడు రుడా కూడా కాంగ్రెస్ పాలనలోనే ఏర్పాటయ్యింది. దీంతో ఈ ప్రాంతం బీ గ్రేడ్ నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, సింగరేణి అనుబంధంగా పరిశ్రమల స్థాపనకు మంత్రి శ్రీధర్‌బాబు చొరవ చూపుతున్నారన్నారు. రామగుండంలో రూ.260కోట్లతో టెండర్ల ప్రక్రియ పూర్తయ్యిందని, నగర సుందరీకరణ, మెడికల్ కళాశాలలో పీజీ, డెంటల్, నర్సింగ్ కోర్సుల ఏర్పాటు, పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ వినియోగంలోకి తీసుకురావడం, గోదావరి వరదల నివారణకు రిటర్నింగ్ వాల్ సాధించేందుకు ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు బొంతల రాజేష్, మారెల్లి రాజిరెడ్డి, ఆసిఫ్, గుండేటి రాజేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఖని'లో వాలీబాల్ టోర్నమెంట్

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మూడు రోజులపాటు ఇంటర్‌డిస్ట్రిక్ట్ అండర్-17 బాయ్స్, గర్ల్స్ వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మణ్, కొమురోజు శ్రీనివాస్ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలను మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌లు ప్రారంభించనున్నారు. ఈ పోటీలకు స్టేడియంలో పనులను వేగవంతంగా చేస్తున్నారు.



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ

కోల్‌సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గోదావరిఖని గోదావరి వంతెన వద్ద నుంచి ఎన్‌టీపీసీ వరకు గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతినిత్యం సైక్లింగ్ చేయాలని, దీంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ సైకిల్ ర్యాలీ గోదావరిఖని జీఎం ఆఫీస్, చౌరస్తా, మార్కండేయకాలనీ, గౌతమినగర్ నుంచి జ్యోతి భవన్ వరకు 18కిలో మీటర్లు కొనసాగింది. ఈ ర్యాలీలో వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, టుటౌన్ సీఐ ప్రసాద్‌రావు, రామగుండం సీఐ ప్రవీణ్‌తో పాటు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. పట్టణంలోని 13, 14వ వార్డుల్లో 67లక్షల 58 వేల రూపాయల టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపడుతున్న బీటీ, సీసీరోడ్ల పనులు, సీసీ మురికి కాలువల నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే విజయరమణారావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. మౌళిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుచేస్తున్నామని, రానున్న రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రజలకు అభయమిచ్చారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రంలో వడ్డీలు కడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు నడిపిస్తున్న ఘనత కాంగ్రెస్ సర్కార్‌దేనని అన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ నేతలు జన్వాడ ఫాం హౌస్ రేవ్ పార్టీపై ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన బీఆర్‌ఎస్ నేతలు జైలుకెళ్ళక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప, తాడూరి శ్రీమాన్, ఉప్పు రాజు, సయ్యద్ మస్రత్, జగదీష్, మండల సత్యనారాయణరెడ్డి బుషనవేన సురేష్‌గౌడ్, భూతగడ్డ సంపత్, అశోక్‌గౌడ్, కొమ్ము శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి

ముత్తారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయాలని ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు బండారి సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం ముత్తారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి ఉద్యమకారుల మండల మహిళా అధ్యక్షురాలు ఇందారపు లక్ష్మి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి ఒక కమిటీ ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అదేవిధంగా ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేసి ఉద్యమ కళాకారులకి సాంస్కృతిక సారధిలో 100మందికి ఉద్యోగాలు కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లలో సాంస్కృతిక సారధిలో ఉన్న నిరుపేదలను గుర్తించి పది శాతం ఇళ్లు ఉద్యమ కళాకారులకు కేటాయించాలన్నారు. అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలని, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యమ కళాకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి వృద్ధ కళాకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఉద్యమ కళాకారులను తెలంగాణ రాష్ట్ర సాధకులుగా గుర్తించి గౌరవించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల మండల ఉపాధ్యక్షుడు బర్ల నరేష్ కార్యదర్శి అల్లం తిరుపతి తూటి లక్ష్మణ్ కలవేన బాలమల్లు తోట సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

యూపీఎల్ అధికారులపై చీటింగ్ కేసు నమోదు

జ్యోతినగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ సంస్థలో కాంట్రాక్టు వ్యవహారాలు చేసిన యూటిలిటీ పవర్ టెక్(యూపీఎల్) సంస్థ అధికారులపై ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఎన్టీపీసీ ప్రాజెక్టులో కాంట్రాక్టరుగా పని చేస్తున్న చందా రాధా కిషన్‌రావుకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. సుమారు 48 లక్షల రూపాయల బిల్లులు ఇవ్వకుండా తనను వేధిస్తున్నారని రాధా కిషన్‌రావు ఫిరాదులో పేర్కొన్నారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ యూపీఎల్ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కాంట్రాక్టరు తెలిపారు. రాధాకిషన్‌రావు ఫిర్యాదు మేరకు యుపీఎల్ సీఈవో (నోయిడా) తేంద్ర సింగ్, ఆర్ఎం (రామగుండం ఎన్టీపీసీ) కైలాస్ ప్రసాద్, అధికారులు స్వాతి శుక్లా, సీమా ప్రసాద్‌లపై ఎన్టీపీసీ పీఎస్‌లో కేసు నమోదైంది. కాగా యూపీఎల్ సంస్థ కార్యకలాపాలు ఎన్టీపీసీలో చాలా రోజుల క్రితమే నిలిపివేశారు.

పురుగుల మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

గన్నేరువరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒంటరితనంతో మనస్తాపం చెందిన ఓ వృ ద్ధురాలు ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చొక్కారావుపల్లికి చెందిన ముస్కు లచ్చవ్వ(80) అనే వృద్ధురాలికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. అందరికి పెళ్లిళ్లు చేసింది. లచ్చవ్వ భర్త గతంలోనే మృతి చెందాడు. కూతుళ్ల వివాహం అనంతరం ఇంట్లో ఒక్కతే ఉంటున్నది. వృద్ధాప్యంలో ఉన్న తనను కూతుళ్లు చూసుకుంటారో లేదోననే బెంగతో ఆదివారం పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. లచ్చవ్వ కుమార్తె నాగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన బాణాసంచా పట్టివేత

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఓ ఇంట్లో నిల్వ చేసిన బాణాసంచాను ఆదివారం పట్టుకున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంట్లో ఎలాంటి అనుమతి లేకుండా బాణాసంచా నిల్వ చేశారని సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. రూ. 4.37 లక్షల విలువ గల క్రాకర్స్‌ను సీజ్ చేశారు. సీఐ తిరుమల్ గౌడ్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా టపాసులు నిల్వ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడి

రామడుగు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నర్సింగారావు చెరువు సమీపంలో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు ఆదివారం పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 7,070 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి శేఖర్ తెలిపారు.

ఆదర్శం

పేదలకు పెద్దదిక్కు
రేకుర్తి నేత్ర వైద్యశాల

పేదల ఆసుపత్రిగా పేరుగాంచింది రేకుర్తి నేత్ర వైద్యశాల. అత్యాధునిక సదుపాయాలతో సేవాభావం కలిగిన వ్యక్తుల పర్యవేక్షణలో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. దృష్టి లోపం ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి శస్త్ర చికిత్సలు అవసరం ఉన్న వారిని గుర్తించి ఉచితంగా సొంత వాహనాల్లో ఆసుపత్రికి తరలిస్తారు. ఇప్పటి వరకు 1.8లక్షల మందికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించారు.



రేకుర్తిలోని డాక్టర్ భాస్కర్ మాడేకర్ నేత్ర వైద్యశాల



కంటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్న వైద్యులు

- డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఆలోచనతో అంకురార్పన
- పివి చేతుల మీదుగా ప్రారంభం
- మూడు దశాబ్దాలకు పైగా సేవలు
- 1,80,000 మందికి కంటి ఆపరేషన్లు

భగత్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సర్వేంద్రి యానాం.. నయనం ప్రధానం అన్నారు పెద్దలు. నేత్ర సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారిని ఆదుకుంటోంది రేకుర్తిలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఉదార నేత్ర వైద్యశాల. ఈ ఆసుపత్రిని 1988వ సంవత్సరంలో ఆనాటి కేంద్ర మంత్రి పీవీ నర్సింహారావు ప్రారంభించారు. మూడెకరాల స్థలంలో ఆహ్లాదకర వాతావరణంలో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. దేశంలోని నలుమూలల నుంచి వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. 37 సంవత్సరాలుగా 7.95 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 1.8 లక్షల మందికి ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారు. అందులో లక్ష కంటి శస్త్ర చికిత్సలు ఉచితంగా చేశారు. జిల్లాలోని 65 ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్న పిల్లలకు ఉచితంగా కంటి అద్దాలు అందించారు. నగరానికి చెందిన ఇంజనీర్ కోల అన్నారెడ్డి సహకారంతో 4,190 చనిపోయిన వారి నుంచి కళ్లు సేకరించి ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి పంపించారు. వారానికి నాలుగు గ్రామాల్లో నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా కంటి ఆపరేషన్లు, కంటి అద్దాలు, ఉచిత భోజన వసతి కల్పిస్తారు.

అందుబాటులో ఆధునిక పరికరాలు

రేకుర్తి నేత్ర వైద్యశాలలో కార్పొరేట్ స్థాయిలో శస్త్రచికిత్సలు, పరీక్షల కోసం అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఆరు ఆపరేటింగ్ మైక్రోస్కోప్‌లు, ఐదు ఆటో రిఫ్రాక్టర్ మీటర్స్ ఐవోఎల్ మాస్టర్, ఏడీ యాగ్లేజర్, విజువల్స్ గ్లీన్లజర్, మూడు ఫాకో మిషన్లు, (సెంచురియన్, లారియేట్, లైజియాన్), ఆటో లెన్సోమీటర్, నాన్ కాంటాక్ట్ టొనమీటర్, హమ్‌ఫ్రేస్ ఫీల్డ్ అనలైజర్, ఎ స్కాన్ బయోమీటర్ ఆక్ట్-2, ఆటో క్లేవ్ ఉన్నాయి. ఆసుపత్రికి మూడు బస్సులు, ఒక మినీ వ్యాన్‌లు ఉన్నాయి. ఈ వాహనాల ద్వారా రోగులను ఆసుపత్రికి తీసుకొస్తుంటారు.



ఆసుపత్రిలోని అధునాతన పరీక్షా యంత్రం

ప్రత్యేక శస్త్ర చికిత్సలు

కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేసే శస్త్ర చికిత్సలు రేకుర్తి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి. అత్యాధునిక పరికాలతో కూడిన ఆపరేషన్ థియేటర్ ఇక్కడి ఉంది. ఆసుపత్రి అభివృద్ధి కోసం ఛైర్మన్ కొండావేణుమూర్తి, వైస్ ఛైర్మన్ చిదుర సురేష్, వైస్ ఛైర్మన్ ప్రకాశ్ హోల్లా, సెక్రటరీ బొమ్మ పవన్‌కుమార్, డాక్టర్ మురళీధర్‌రావు, కోల అన్నారెడ్డి కృషి చేస్తున్నారు.

నిష్ణాతులైన వైద్యులు

50 రూపాయల నామ మాత్రపు కన్సల్టేషన్ ఫీజుతో, అతి తక్కువ ఖర్చుతో కంటి శస్త్ర చికిత్సలు ఇక్కడ నిర్వహిస్తారు. నిష్ణాతులైన పది మంది వైద్యులు అందుబాటులో ఉంటారు. ఆసుపత్రిలో 70 మంది సిబ్బంది ప్రజలకు సేవలు అందిస్తున్నారు.

మరిన్ని సేవలు అందిస్తాం..

\- కొండా వేణుమూర్తి, ఆసుపత్రి ఛైర్మన్



రేకుర్తిలోని భాస్కర్ మాడేకర్ ఉదార నేత్ర వైద్యశాలలో భవిష్యత్తులో మరిన్ని సేవలను విస్తరించేందుకు కృషిచేస్తున్నాము. భవిష్యత్తులో లేజర్ (లాసిక్) పరికరాన్ని ఏర్పాటు చేస్తాం. పేదలకు సేవ చేయాలనేదే ఆసుపత్రి లక్ష్యం.



కంటి శస్త్ర చికిత్స కోసం వేచి ఉన్న రోగులు

ఆటో బోల్తా.. నలుగురికి తీవ్రగాయాలు



ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

మానకొండూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో ఆటో అదుపు తప్పి బోల్తా పడ్డ సంఘటనలో నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. శంకరపట్నం మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన గడ్డి కుమారస్వామి ఆదివారంతన ఆటోలో ప్రయాణికులను కేశవపట్నానికి తరలిస్తున్నాడు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి కాకతీయ కాల్వ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కుమారస్వామి, చింతకుంట గ్రామానికి చెందిన ఎండీ ఖాజాతో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం మేరకు 108 సిబ్బంది ఈఎంటీ సతీష్‌రెడ్డి, పైలెట్ ఖాజ ఖలీల్ ఉల్లా గాయపడ్డ నలుగురిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండలింగాపూర్ గ్రామానికి చెందిన గడ్డల జ్యోతి (55) అనే మహిళ గ్రామ శివారులోని పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.... జ్యోతి పదేళ్ల నుంచి షుగర్, బీపీతో పాటు మోకాళ్ల నొప్పులతో బాధపడుతోంది. పలు ఆసుపత్రులు తిరిగినా నయం కాకపోవడంతో మనస్తాపం చెంది ఈ నెల 26వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆదివారం ఉదయం పెద్ద చెరువులో జ్యోతి పడి ఉన్న విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐ అనిల్ పరిశీలించి గ్రామస్థుల సహకారంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు జ్యోతి కుమారుడు గడ్డల విక్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఇల్లందకుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుర్తి గ్రామానికి చెందిన ననబోయిన కవిత (43) అనే మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై రాజ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కవిత ఈ నెల 21న పత్తి తీసే పని కోసం ట్రాక్టర్‌లో వెళ్లింది. ట్రాక్టర్‌ను డ్రైవర్ కుమారస్వామి అజాగ్రత్తగా నడుపడం వల్ల దానిపై కూర్చున్న కవిత ప్రమాదవశాత్తు కిందపడింది. ఆమెకు తల, మెడ భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జమ్మికుంటలోని ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందింది. కవితకు భర్త సమ్మయ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ కుమారస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజకుమార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు.

విద్యుదాఘాతంతో బోర్‌వెల్ మెకానిక్ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ఇన్‌సెట్‌లో వైద్య వెంకటేశ్వర్లు(ఫైల్)

కోల్‌సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జీఎం కాలనీలో బోర్‌వెల్ మోటార్ మరమ్మతు చేస్తున్న బోర్‌వెల్ మెకానిక్, ఎలక్ట్రిషియన్ వైద్య వెంకటేశ్వర్లు(57) ఆదివారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. జీఎం కాలనీకి చెందిన చిన్నవెల్లి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తన బోర్‌వెల్ మోటార్ పనిచేయడం లేదని బోర్‌వెల్ మెకానిక్ ఎలక్ట్రిషియన్ వెంకటేశ్వర్లును పిలిపించారు. యజమానిని విద్యుత్ సరఫరా నిలిపివేయమని వెంకటేశ్వర్లు చెప్పి స్టార్టర్ ముట్టుకోగా షాక్‌కు గురై మృతిచెందాడు. వెంకటేశ్వర్లు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. స్థానిక విఠల్‌నగర్‌లో నివాసముండే వెంకటేశ్వర్లు కుటుంబాన్ని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పరామర్శించారు. విద్యుత్‌శాఖ పరంగా రూ.5లక్షల పరిహారం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఏడీఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. వెంకటేశ్వర్లు మృతిచెందడంపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. కుమారుడు వైద్య నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఉపా చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సుభాష్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపా చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభను పౌరసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా సాయిబాబా కూతురు మంజీర మాట్లాడుతూ సాయిబాబాను ప్రభుత్వమే హత్య చేసిందని ఆరోపించారు. 90శాతం అంగవైకల్యం, పోలియో ఇతర 19 రకాల వ్యాధులతో బాధపడుతున్న ఆయనకు మందులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. సాయిబాబాను అరెస్టు చేసిన సమయంలో ఆయన వీల్ ఛైర్‌ను కావాలనే ధ్వంసం చేశారని అన్నారు. సమయానికి అత్యవసర మందులు, పుస్తకాలు, ఇతర సామగ్రిని కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. దళితులు, పీడిత ప్రజల పక్షాన, ఆదివాసీలపై ప్రభుత్వాల దమనకాం డకు వ్యతిరేకంగా మాట్లాడినందుకు ప్రభుత్వం ఆయనపై కక్ష కట్టిందని ఆరోపించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఆదివాసీలను హననం చేసే ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఎన్నో సభలు నిర్వహించడంతోనే ప్రభుత్వం ఆయనపై అక్రమంగా ఉపా కేసు మోపి జైల్లో నిర్బంధించిందన్నారు. జైల్లో ఎందరో ఆదివాసీ యువకులను చేయని నేరానికి అక్రమంగా నిర్బంధించారని, వారి కోసం ఒక విద్యాసంస్థను నెలకొల్పే ఆలోచన సాయిబాబకు ఉండేదని ఆమె అన్నారు.

కార్యక్రమంలో విరసం నాయకుడు బాలసాని రాజయ్య, పౌర హక్కుల సంఘం బాధ్యులు శ్రీపతి రాజగోపాల్, నారా వినోద్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె విశ్వనాథ్, రిటైర్డ్ ఎంఈవో వీరగోని పెంటయ్య, పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్, డీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడి సుదర్శన్, రైతు సంఘం నాయకుడు ముడిమాడుగుల మల్లన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, మానవహక్కుల వేదిక బాధ్యులు కె ఆజయ్, రచయితలు అవునూరి సమ్మన్న, దేవేందర్, విద్యార్థి సంఘం నాయకులు చుక్క గంగారెడ్డి, దొగ్గలి రాజు, రచయిత కందుకూరి అంజయ్య, దళిత హక్కుల పోరాటాల సమితి తాళ్లపల్లి లక్ష్మణ్, ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లగౌడ్, సీపీఐ, సీపీఎం, డీటీఎఫ్, ఎంసీపీఐ, మానవ హక్కుల వేదిక, ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సాయిబాబా కూతురు మంజీర

బెటాలియన్‌లో పోలీసుల నిరసన

\- సస్పెన్షన్ ఎత్తివేయాలని

కమాండెంట్ ఆఫీస్ ఎదుట ధర్నా



సిరిసిల్ల బెటాలియన్‌లో ధర్నా చేస్తున్న పోలీసులు

సిరిసిల్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 17వ బెటాలియన్‌లో పోలీసులు, హెడ్‌కానిస్టేబుళ్ల నిరసనలు కొనసాగాయి. ఏక్‌పోలీస్ అమలు చేయాలంటూ చేసిన ఆందోళనలో సస్పెన్షన్‌కు గురైన 39 మందిలో జిల్లా బెటాలియన్‌కు సంబంధించి బి తిరుపతి, బి శేఖర్ కె స్వామి, ఎ లక్ష్మణ్, శివరామకృష్ణ, కె నవీన్ ఉన్నారు. ఆదివారం వారితోపాటు బెటాలియన్ సముదాయంలో మిగతా పోలీసులు కమాండెంట్ ఆఫీస్ ఎదుట సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ధర్నా చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఏక్ పోలీస్ అమలు చేయాలని శాంతియుత నిరసన చేస్తే కొంత మందిని సస్పెండ్ చేశారన్నారు. సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, లేనిపక్షంలో నిరసనలో పాల్గొన్న తమను కూడా సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు.

పాత వాటికి కొత్త రూపం..

ఏదో సాధించాలనే ఆలోచన ఈ యువకుడిది.. నూతన ఆవిష్కరణలతో మూడుసార్లు వరల్డ్ రికార్డు సాధించాడు. రోబో, రిమోట్‌తో జాతీయ జెండాను ఎగురవేయడంతో పాటు ఎలక్ట్రిక్ బైక్ రూపొందించింది పలువురి ప్రశంసలందుకున్నాడు. పాత వస్తువులకు కొత్త రూపమిస్తూ అందరిని ఆకట్టుకుంటున్నాడు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికికి చెందిన బోసెట్టి భగత్ ప్రశాంత్...

- వినూత్న రీతిలో వస్తువుల తయారీ
- ఖని యువకుడి అద్భుత ఆవిష్కరణలు



పెట్రోల్ స్కూటీని ఎలక్ట్రికల్‌గా మార్చిన భగత్



వీల్‌రోలర్‌తో భగత్

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): నిత్యం ఏదైనా కొత్తగా సాధించాలనే తపన ఆ యువకుడిది. చదివిన చదువుతో తనకున్న జ్ఞానాన్ని జోడించి సరికొత్త ఆవిష్కరణలకు ప్రాణం పోస్తున్నాడు గోదావరిఖనికి చెందిన భగత్ ప్రశాంత్. స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన భగత్ డిప్లమా ఎలక్ట్రానిక్స్, డిగ్రీ బీకాం చదివాడు. పనికిరాని వస్తువులతో రోబోను, రిమోట్‌తో జాతీయ జెండాను ఎగురవేయడం, వీల్ రోలర్స్, పెట్రోల్‌తో నడిచే స్కూటీని ఎలక్ట్రిక్ స్కూటీగా తయారుచేయడంతో పాటు బైక్ పిస్టన్ ఎయిర్ డివైస్‌ను తయారు చేసి మూడు సార్లు వరల్డ్ రికార్డు సాధించాడు. పనికి రాని వస్తువులతో సరికొత్త వస్తువులను తయారుచేస్తున్నాడు. పెట్రోల్‌తో నడిచే స్కూటీని ఎలక్ట్రిక్ స్కూటీగా మార్చాడు. ఇది గంటకు 22 కిలోమీటర్ల స్పీడ్‌తో వెళుతుంది. భగత్ చెబుతున్నాడు. ఇలాంటి రెండు ఎలక్ట్రిక్ స్కూటీల్లో ఒకటి తన తండ్రికి బహుమతిగా ఇచ్చి, మరొకటి తాను వాడుకుంటున్నాడు. ఇందుకు గాను అప్పటి జిల్లా కలెక్టర్ సంగీతసత్యనారాయణ నుంచి ప్రశంసలు అందుకున్నాడు. అలాగే కొబ్బరి తురుమును తయారు చేసుకోవడానికి ఇళ్లలో మహిళలు ఇబ్బంది పడుతున్నారని గ్రహించిన భగత్ మార్కెట్‌లో ఎక్కువ ధర లభించే వాటికన్నా తక్కువ ధరలో మిషన్‌ను తయారు చేశాడు. ఇలా వినూత్న రీతిలో సరికొత్త ఆవిష్కరణలు చేస్తూ అందరితో భళా భగత్ అనిపించుకుంటున్నాడు.

ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని ఆవిష్కరణలు

\- భగత్‌ప్రశాంత్

చిన్నప్పటికి వస్తువులను తయారు చేయాలనే తపన ఉండేది. అందుకే డిప్లమా ఎలక్ట్రానిక్స్ చదివాను. అప్పటి నుంచి పనికి రాని వస్తువుతో ఏదో ఒకటి తయారు చేస్తూ వస్తున్నాను. తయారు చేసిన రెండు ఎలక్ట్రిక్ స్కూటీల్లో ఒకటి నేను, మరొకటి నాన్న నడుపుతున్నాం. వీల్‌రోలర్స్, బైక్ పిస్టమ్ ఎయిర్ మిషన్ తయారు చేశాను. అందుకు మూడుసార్లు వరల్డ్ రికార్డులు అందుకున్నాను. చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని ఆవిష్కరణలను రూపొందిస్తాను. నాన్న భగత్ ప్రశాంత్ సైకిల్ రిపేర్ షాపు నడుపుతున్నాడు. కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో నేను ఆర్ఎఫ్‌సీఎల్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాను.

నేపాల్‌లో కరీంనగర్ వాసి మృతి

-ఆధ్యాత్మిక యాత్రలో విషాదం



కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నేపాల్ యాత్రకు వెళ్లిన కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన పర్వతనేని నర్సింగారావు(60) అనారోగ్యానికి గురై ఆదివారం మృతి చెందాడు. మృతుడి బంధువులు, స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా మరిమడ్ల గ్రామానికి చెందిన నర్సింగారావు చాలా కాలం కిందట కరీంనగర్‌కు వచ్చి ఇక్కడే ప్రగతినగర్‌లో స్థిరపడ్డాడు. అరుణాచలంలోని రుద్రాక్షస్వామి ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 250 మంది ఈనెల 18న నేపాల్ యాత్రకు వెళ్లగా, అందులో కరీంనగర్‌కు చెందిన నర్సింగారావు ఉన్నారు. నేపాల్‌లోని పశుపతినాథ్, ముక్తినాథ్, జనక్‌పూర్ ప్రాంతాల సందర్శనలో భాగంగా మూడు రోజుల కిందట ముక్తినాథ్‌యాత్రలో నర్సింగారావు స్నానం చేసే సమయంలో ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే తోటి యాత్రికులు అతన్ని జనక్‌పూర్‌లోని ఒక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. నర్సింగారావు అనారోగ్యంకు గురైన విషయాన్ని కరీంనగర్‌లోని ఆయన కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. అతని ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు ఎయిర్ అంబులెన్స్‌ను కూడా సిద్ధం చేస్తుండగా ఆదివారం ఉదయం మృతి చెందాడు. నర్సింగారావుకు భార్య, కూతురు, కొడుకులున్నారు. నర్సింగారావు కరీంనగర్‌లో ఒక ప్రైవేట్ చిట్‌ఫండ్స్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. నర్సింగారావు మృతదేహాన్ని కరీంనగర్‌కు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సింగారావు మృతి పట్ల ప్రగతినగర్ అభివృద్ధి, సంక్షేమ సంఘం ప్రతినిధులు, తోటపల్లి తాజా మాజీ సర్పంచ్ బోయినిపల్లి నర్సింగారావు, మానేరు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సంతాపం తెలిపారు.

గోదావరిలో మునిగి యువకుడి మృతి


వెంకటేష్(ఫైల్)

మల్లాపూర్, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిపేట గ్రామంలోని గోదావరి నదికి తన్నీర్ వెంకటేష్ (27) అను తాపీ మేస్త్రి స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఆదివారం నీట మునిగి మృతి చెందాడు.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తు న్న తన్నీర్ వెంకటేష్ ఆదివారం పనులకు సెలవు కావడంతో తోటి కూలీలతో కలిసి గోదావరి నదికి స్నానానికి వెళ్లాడు. స్నానం చేస్తున్న క్రమంలో ఈత రాకపోవడంతో వెంకటేష్ నీటిలో మునిగిపోయాడు. గమనించిన తోటి కూలీలు, స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో మునిగి వృద్ధుడు..

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని చెరువులో ప్రమాదవశాత్తు నీట మునిగి పోచెట్టి మాలద్రి(65) అనే భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి చెందిన పోచెట్టి మాలద్రి జగ్గసాగర్ గ్రామంలోని ఓ మేస్త్రి వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం గ్రామంలోని చెరువులో ఒడ్డున ఉండి స్నానం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి నీటిలో మునిగాడు. అక్కడే ఉన్న స్థానికులు గమనించి ఒడ్డుకు చేర్చినా అప్పటికే మృతి చెందాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానిన పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లైఫ్ స్టైల్

సెకండ్ హ్యాండైనా.. కొనేద్దాం..


కోరుట్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న సెకండ్ సేల్స్ కారు

6 పాతదో, కొత్తదో ఇంటికో కారు ప్రస్తుత రోజుల్లో సాధారణమైపోయింది. ఎవరి ఆర్థిక పరిస్థితిని బట్టి వారికి అందుబాటులో ఉన్న కారును కొనుక్కుని అవసరాలకు వినియోగించుకుంటున్నారు. కుటుంబంలో నలుగురు సభ్యులు ఉన్నారంటే చాలు కారు అవసరం ఉంటోంది. అందరూ కలిసి పండగలకు ఊరు వెళ్లాలన్నా, ఏ విహార యాత్రలకు వెళ్లాలన్నా స్వంత కారైనా లేదా అద్దె కారైనా తీసుకుని వెళ్తున్నారు. వినియోగదారుల ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా మార్కెట్లో సెకండ్ హ్యాండ్ కార్లు లభిస్తున్నాయి. అందుబాటు ధరల్లో ఉండడంతో పాటు ఫైనాన్స్ సౌకర్యం కూడా కల్పిస్తుండడంతో కొనేందుకు ముందుకు వస్తున్నారు. అయితే ఎప్పటికప్పుడు లేటెస్ట్ వర్షన్‌లతో కొత్త కార్లు మార్కెట్లోకి రావడంతో యజమానులు పాత వాటిని తీసేసి కొత్తవి కొంటున్నారు. దీంతో మార్కెట్లో మంచి కండిషన్ ఉన్న కార్లు అమ్మకానికి పెట్టేస్తున్నారు.

- మార్కెట్‌లో యూజ్డ్ కార్లకు డిమాండ్
- కొత్త వాటితో పోలిస్తే పాతిక శాతం ధరల్లోనే లభ్యం
- మక్కువ చూపుతున్న మధ్య తరగతి వర్గాలు

జగిత్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ కారులో తిరగాలనే కోరిక ఉండటం సహజమే. సొంత ఇల్లు అనే కోరిక నెరవేరిన తర్వాత ప్రతి మనిషికి ఉండే స్వప్నం కారు. ఇల్లు, ఇంటి ముందు కారు ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ఇప్పుడున్న ప్రస్తుత సమాజంలో కార్లను కొనేందుకు ఎంతో మంది ఆసక్తి చూపిస్తున్నారు. కొంతమంది మాత్రం మార్కెట్లోకి ఏ కొత్త రకం కారు వస్తే దానిని కొనేస్తుంటారు. అందుకు తగ్గట్టుగానే కస్టమర్స్‌ను ఆకర్షించేలా పలు రకాల కార్లు అందుబాటులోకి


జగిత్యాలలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న యూజ్‌డ్ కార్లు

వస్తున్నాయి. మరి కొంతమందికి కారులో తిరగాలని కోరిక ఉన్నా, కారు కొనుగోలు చేసే స్తోమత లేక వెనకడుగు వేస్తుంటారు. మరికొంత మంది మాత్రం కొత్త కారుకు బదులు సెకండ్ హ్యాండ్ కార్లను కొనుగోలు చేస్తుంటారు. అందుకు అనుగుణంగా కస్టమర్లను ఆకట్టుకునేలా అన్ని రకాల సెకండ్ హ్యాండ్ కార్స్ కన్సల్టెన్సీలో అందుబాటులో ఉంటున్నాయి. జిల్లా కేంద్రమైన జగిత్యాలతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి తదితర పట్టణాల్లో సుమారు పాతిక వరకు సెకండ్ హ్యాండ్ కార్స్ సెల్స్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి.

అప్ గ్రేడ్ వర్షన్‌లోకి మారుతుండడం వల్లే...

ఇక ఇప్పటికే కార్లున్నవారు అప్‌గ్రేడ్ వెర్షన్‌లోకి మారడం కూడా యూజ్డ్ కార్ల మార్కెట్‌లోకి పెద్ద ఎత్తున వాహనాలు వచ్చేలా చేస్తున్నది. ఇదిలా ఉంటే కుటుంబం మొత్తం తక్కువ ఖర్చుతో ప్రయాణించే వెసులుబాటు ఉం డటం, ప్రైవసీ, ఇతరత్రా సౌకర్యాల వల్ల కూడా ఇప్పుడు మధ్యతరగతి వర్గాలు యూజ్డ్ కార్లపైనే మక్కువ చూపిస్తున్నారు. మొత్తానికి లగ్జరీ కార్ల దగ్గర్నుంచి మిడిల్, స్మాల్ సెగ్మెంట్లలోని కార్లు ఈ ప్రీ-ఓన్డ్ వెహికల్స్ మార్కెట్‌లో లభిస్తున్నాయి.

అందుబాటు ధరల్లో..

ప్రీ ఓన్డ్ వెహికల్ బిజినెస్ మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. నచ్చిన కార్లు సరసమైన ధరలకే లభిస్తుండడం, ఫైనాన్స్ సౌకర్యం కూడా ఉండటం, వారంటీలు ఇస్తుండడంతో పలువురు సెకండ్ హ్యాండ్ కార్లను కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు.కొత్త కార్ల ధరలతో పోల్చితే 15-25 శాతం ధరల్లోనే యూజ్డ్ కార్లు అందుబాటులో ఉంటుండటం ఇప్పుడు ఈ మార్కెట్‌ను పరుగు పెట్టిస్తున్నది. సెకండ్ హ్యాండ్ కారును కొనుగోలు చేయడం వల్ల కొత్త కారుతో పోలిస్తే డబ్బులు చాలా ఆదా అవుతాయి.మార్కెట్‌లోకి రకరకాల వేరియంట్లు, అబ్బురపరిచే ఫీచర్లతో వస్తుండడంతో చాలా మంది ఇప్పటికే ఉన్న పాత కార్లను అమ్మేస్తున్నారు. ఇందుకు సెకండ్ హ్యాండ్ కార్ సేల్ సెంటర్లు చక్కటి వేదికలుగా నిలుస్తున్నాయి. ఇక అటు అమ్మే వారికి, ఇటు కొనే వారికి లాభదాయకంగా లావాదేవీలు జరుగుతుండడం...ఈ బిజినెస్‌ను బడా మార్కెట్‌గానే మార్చేస్తోంది. ఏదైనా కంపెనీకి చెందిన ఓ మోడల్ కొత్త కారు ధర రూ. 10 లక్షలుగా ఉంటే...అదే మోడల్ పాత కారు ధర రూ. 2 లక్షలుగానే ఉండటం...కస్టమర్లను ఈ వైపు చూసేలా చేస్తున్నదని మార్కెట్ వర్గాలు ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నాయి. కండీషన్‌లో ఉండి, తక్కువ కిలో మీటర్లు తిరిగి, అప్‌గ్రేడ్ వెర్షనైతే మరో రూ. 50,000ల నుంచి రూ. లక్ష రూపాయలు ఎక్కువగా పెట్టుకోవాల్సి వస్తుందని చెప్తున్నారు. దీంతో అన్ని విధాలా సరిపోయే కారు రూ. 2.5 లక్షలు - రూ. 3 లక్షల్లో వచ్చేస్తున్నది.

నచ్చిన కార్లు...తక్కువ ధరల్లోనే..

- కట్కం ప్రసాద్, జగిత్యాల జిల్లా



నచ్చిన కార్లు సరసమైన ధరల్లోనే అందుబాటులో లభిస్తుండడంతో చాలా మంది సెకండ్ హ్యాండ్ కార్లు కొనుగోలు చేస్తున్నారు. మంచి కండిషన్‌లో ఉన్న కార్లను తక్కువ ధరలకు కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. ప్రయాణానికి సైతం సౌకర్యవంతంగా ఉంటున్నాయి.

ఫైనాన్స్ సౌకర్యం సైతం ఉంటోంది

- దొనికెల నవీన్, యువకుడు, జగిత్యాల జిల్లా



సెకండ్ హ్యాండ్ కార్లు కొనుగోలు చేస్తున్న యజమానులకు ఫైనాన్స్ సౌకర్యం సైతం అందుతోంది. తక్కువ ధరలో మంచి మోడల్ కారు లభిస్తుండడంతో దీనికి తోడు తక్కువ వడ్డీతో ఫైనాన్స్ సౌకర్యం ఉంటుండడం వల్ల సెకండ్ సేల్స్ వైపు వినియోగదారులు ఆసక్తికనబరుస్తున్నారు.

మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో..

- ప్రభురాజ్ లక్ష్మీ నర్సయ్య, ప్రయివేటు డ్రైవర్, జగిత్యాల జిల్లా



మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో సెకండ్ హ్యాండ్ కార్లు లభిస్తున్నాయి. ఇందు వల్ల చాలా కుటుంబాలు సెకండ్ హ్యాండ్ కార్లు కొనుగోలు చేసి తమ కలను నిజం చేసుకుంటున్నారు. మార్కెట్‌లో వస్తున్న కొత్త వర్షన్ కార్లపై క్రేజీ పడుతున్న కొందరు తమ వద్ద ఉన్న పాత కారును ఎంతో కొంతకు అమ్ముతున్నారు. వీటిని కొనుగోలు చేసి మధ్య తరగతి కుటుంబాల సభ్యులు వినియోగిస్తున్నారు.

న్యూస్ బాక్స్

కస్తూర్బా విద్యార్థినులకు అస్వస్థత

ముత్తారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాలలోని సుమారు 50 మంది విద్యార్థినులు ఆదివారం సాయంత్రం అస్వస్థతకు గురయ్యారు. ఆరు, ఏడు తరగతుల విద్యార్థినులకు ఒక్కసారిగా 50 మందికి పైగా దగ్గు రావడంతో పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు గమనించి ప్రాథమిక చికిత్స అందించి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం వాతావరణ మార్పుల వల్ల విద్యార్థులు దగ్గరదగ్గరగా ఉండడంతో దగ్గు అందరికీ వ్యాపించిందని వైద్యుడు అమరేందర్ తెలిపారు. విద్యార్థులు ఆ సమయానికి భోజనం చేయలేదు కనుక ఫుడ్ పాయిజన్ కాలేదని నిర్ధారించారు. తొమ్మిది గంటల వరకు విద్యార్థినులకు దగ్గు తగ్గడంతో ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు నిర్ధారణ చేశారు. కాగా, విద్యార్థినులకు ఒక్కసారిగా దగ్గు రావడంతో స్థానికంగా ఉన్న తల్లిదండ్రులు ఆందోళన చెందారు. పాఠశాల వద్దకు వెళ్లడంతో వారిని ఆవరణలోకి అనుమతించకపోవడంతో కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు విద్యార్థినులు దగ్గుతో ఇబ్బంది పడుతున్నారన్న ఆందోళనతో తల్లిదండ్రులు వివరాలు అడిగేందుకు ప్రయత్నించారు. అయితే పాఠశాల లోపల ఉన్నవారు గేట్లకు తాళాలు వేసి నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబులెన్స్ తో పాటు ప్రైవేటు వాహనాల్లో తల్లిదండ్రులు, స్థానికుల సహకారంతో పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి విద్యార్థినులను సమయానికి తరలించడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

'రాజన్న' గోశాల పరిశీలన

వేములవాడ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజన్న గోశాలను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. కోడెలకు సకాలంలో మేత వేయాలని ఉద్యోగులకు సూచించారు. కట్ట కింద గోశాలను, కొత్తగా వచ్చిన ఆరు కోడెలను పరిశీలించారు. సోమవారం సందర్భంగా భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున నందీశ్వర, లక్ష్మీగణపతి ధర్మశాలలను పరిశీలించారు. ఆయన వెంట ప్రోటోకాల్ మరియు గదుల విచారణ పర్యవేక్షకులు జి అశోక్ కుమార్, గోశాల ఇన్‌చార్జి వి పరమేష్ ఉన్నారు.

జాతీయ యోగాలో తెలంగాణకు పసిడి పతకం

- రికార్డు సృష్టించిన దీపక్



బంగారు పతకంతో దీపక్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి యోగా పోటీల్లో తెలంగాణకు తొలి సారిగా స్వర్ణ పతకం లభించింది. జిల్లాలోని మానకొండూర్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న పి దీపక్ సబ్‌జూనియర్ విభాగంలో పసిడి పతకం సాధించి రికార్డు సృష్టించాడు. హిమాచల్‌ప్రదేశ్‌లోని ఉనాలో ఈనెల 24 నుంచి 27 వరకు జరిగిన జాతీయ పోటీల్లో దీపక్ గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా దీపక్‌ను, కోచ్ రామకృష్ణను తెలంగాణ యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ బాధ్యులు అభినందించారు.

జూడో పోటీల్లో సత్తా చాటాలి

- రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు కడారి అనంతరెడ్డి


పోటీలను ప్రారంభిస్తున్న కడారి అనంతరెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తాచాటి చాంపియన్‌గా నిలవాలని రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు కడారి అనంతరెడ్డి అన్నారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్ మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల జూడో ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులలో ఆత్మస్థైర్యానికి, ఆత్మ విశ్వాసానికి జూడో క్రీడ ఎంతగానో దోహద పడుతుందన్నారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా స్థాయి జూడో ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 150 మందికిపైగా బాలబాలికలు హాజరైనట్లు పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో రాణించిన క్రీడాకారులను వరంగల్ జిల్లాలో జరిగే 68వ రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సరితరెడ్డి, పీడీలు, పీఈటీలు రమణ, విద్యాసాగర్, శ్రీధర్, శ్రీనివాస్, సుధాకర్, నరేందర్, కోచ్ సాయిరాం యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


రుచిత్‌రెడ్డి

ఇల్లంతకుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అంకిళ్ల రుచిత్‌రెడ్డి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న రుచిత్‌రెడ్డి పాఠశాల స్థాయి క్రీడలలో అండర్ 17విభాగంలో ఇటీవల గోదావరిఖనిలో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై హెచ్‌ఎం పావని, వ్యాయామ ఉపాధ్యాయుడు సాన బాబు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బట్టు పద్మ తదితరులు అభినందించారు.

రాష్ట్రంలో యువజన కమిషన్ ఏర్పాటు చేయాలి

- యువతకు ఉపాధి కల్పనలో మోదీ సర్కారు విఫలం
- సీపీఐ జాతీయ నేత చాడ వెంకట్‌రెడ్డి

జ్యోతినగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యువజన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌నకు చాడా వెంకట్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. స్వాతంత్రం వచ్చి 76ఏళ్లు దాటుతున్నప్పటికీ దేశంలో ఆర్థిక అసమానతలు అలాగే ఉన్నాయన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వల్ల దక్కిన ప్రాథమిక హక్కులను సైతం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హరిస్తోందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత మత రాజకీయాలకు ప్రాధాన్యతనిస్తున్నాడని విమర్శించారు. దేశంలో యువకు ఉపాధి మార్గాలు చూపించకుండా అభివృద్ధి సాధ్యం కాదన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఇచ్చిన హామీని మోదీ మర్చిపోయాడన్నారు. 10 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. దేశంలోని సహజ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. ఆల్ ఇండియా యూత్ పెడరేషన్(ఏఐవైఎఫ్) జాతీయ క్యాదర్శి తిరుమలై రామన్ ప్రసంగిస్తూ సిద్ధాంతపరమైన రాజకీయ, శాస్త్రీయ ఆచరణకు వర్క్‌షాప్‌లు దోహదపడుతాయన్నారు. విద్య, ఉపాధి, వైద్యం కోసం నేటి యువత పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మానస్ కుమార్, మార్కురురి సూర్య, నాయకులు రవి, శంకర్, యుగంధర్, శ్రీనివాసులు, రామకృష్ణ, మహేందర్, కొండల్, మహేశ్, చిలుక రాజు, శ్రీను, సదానందం, గౌతం, మోహన్, కనకరాజు, ప్రజానాట్యమండలి కళాకారులుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి


వరద కాలువలో వైద్యుడి గల్లంతు


ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ, సీఐ, ఇన్‌సెట్‌లో పాకనాటి ఉదయ్‌కిరణ్‌రెడ్డి(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి రూరల్ మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రా మంలోని విట్టంపేట శివారులో ఉన్న ఎస్సారెస్పీ వరద కాలువలో ఈత కొడుతూ పాకనాటి ఉదయ్‌కిరణ్‌రెడ్డి(29) అనే వైద్యుడు ఆదివారం గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, రాయికల్ మండల కేంద్రాల్లో వైద్యులుగా పనిచేస్తున్న పాకనాటి ఉదయ్‌కిరణ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్ స్నేహితులు. ఆదివారం వారంతా సరదాగా గడపడానికి మరో ఇద్దరు వైద్యులు ఆత్మకూరి రాజు, లింగాల నిఖిల్‌తో కలిసి మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో విట్టంపేట శివారులో ఉన్న ఎస్సారెస్పీ వరద కాలువలో ఈత కొట్టేందుకు ఆగారు. కాలువలో స్నానం చేయడానికి వారంతా దిగారు. ఈత కొడుతుండగా ఉదయ్‌కిరణ్‌రెడ్డి నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు వెంటనే ఒడ్డుకు చేరుకుని అక్కడే ఉన్న జాలర్లకు విషయం తెలిపారు. జాలర్లు ఎంత ప్రయత్నించినా ఉదయ్‌కిరణ్‌రెడ్డి ఆచూకీ తెలియలేదు. పోలీసులు అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్సారెస్పీ అధికారులకు సమాచారం అందించి నీటి ప్రవాహం తగ్గించేందుకు వరుదకాలువ గేట్లు మూసివేయించారు. అప్పటికే చీకటి పడిపోవడంతో గాలింపు చర్యలకు ఆటంకంగా మారింది. ఉదయ్‌కుమార్‌రెడ్డి హనుమకొండ జిల్లా వేలేరు గ్రామానికి చెందిన వాడు. ఆయన గల్లంతైన విషయాన్ని కుటుంబ సభ్యులకు, పోలీసులు సమాచారం అందించారు.

దిగువ మానేరులో అరుదైన పక్షులు

- కరీంనగర్‌కు వలస వచ్చిన ఇండియన్ స్కిమ్మర్స్
- ఈ ప్రాంత జీవ వైవిధ్యానికి కొత్త అందం..


మానేరు డ్యాంలో ఇండియన్ స్కిమ్మర్స్ పక్షులు



పక్షులను కెమెరాలో బంధిస్తున్న బర్డ్ వాచర్స్

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ స్కిమ్మర్స్.. ఈ పక్షులు అరుదైనవి.. ఇవి మధ్యప్రదేశ్, రాజస్థాన్ సరిహద్దుల్లో ప్రవహించే చంబల్ నది, ఒడిస్సాలోని మహానది ఇసుక మేటల్లో నివసిస్తూ ఉంటాయి. శీతాకాలంలో ఆహారం కోసం సముద్ర తీర ప్రాంతాలకు వలస వెళతుంటాయి. అటువంటి ఇండియన్ స్కిమ్మర్స్ కరీంనగర్ సమీపంలోని లోయర్ మానేరు డ్యాంలో కనిపించాయి. ఈ పక్షులు గత ఏడాది లోయర్ మానేరు డ్యాంకు వలస వచ్చినట్లుగా ఐయూసీఎన్ (ఇంటర్‌నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్‌వేషన్ ఆఫ్ నేచర్) వారు గుర్తించారు. అరుదైన పక్షులు ఈ ప్రాంతానికి వలస రావడంతో పక్షి ప్రేమికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు వీటి రాకతో ఈ ప్రాంత జీవవైవిధ్యానికి కొత్త అందం చేకూరినట్లైంది. ఈ నెలలో ఇండియన్ స్కిమ్మర్స్ లోయర్ మానేరు డ్యామ్‌లో రెండోసారి కనబడినట్లు ఈ-బర్డ్‌లో రికార్డయ్యింది. ఈ అరుదైన పక్షుల గురించి తెలుసుకోవడానికి కరీంనగర్ బర్డింగ్ కమ్యూనిటీ(కేబీసీ) ప్రతినిధులు ప్రయత్నించారు. ఈ పక్షుల సంఖ్యను లెక్కించడంతోపాటు, వాటి రూస్టింగ్ (విశ్రాంతి)ప్రదేశాలను కనుగొన్నారు. ఈ సమాచారాన్ని కరీంనగర్ అటవీశాఖ అధికారులకు అందించడానికి కరీంనగర్ బర్డింగ్ కమ్యూనిటీ(కేబీసీ) ప్రతినిధులు ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అంతరించిపోతున్న ఇండియన్ స్కిమ్మర్స్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని చర్చించారు.

ఇండియన్ స్కిమ్మర్స్ ప్రత్యేకతలు....

ఇండియన్ స్కిమ్మర్స్ నలుపు రంగులోను, తెలుపు రంగులో ఉంటాయి. ముక్కు ముదురు నారింజ రంగులో, ముక్కు చివరి భాగం పసుపు రంగులో ఉంటుంది. ముక్కుపై భాగం చిన్నగా, కింద భాగం పెద్దగా ఉంటుంది. ఇవి రివర్ టెర్న్ పక్షులను తలపించేలా ఉన్నప్పటికీ, ఆహారాన్ని సేకరించే విధానాన్ని బట్టి వీటిని ప్రత్యేకమైన పక్షులుగా గుర్తించవచ్చు. ఇవి నది ఉపరితలంపై ఎగురుతూ ముక్కుతో నీటిలోని చేపలను అందుకొని గాలిలోనే ఎగురుతూ చేపలను తింటాయి. ఈ కారణంగా వీటిని స్కిమ్మర్స్ అని పిలుస్తారు. ఇవి దక్షిణాసియా భూభాగానికి మాత్రమే పరిమితం. వీటి సంఖ్య అంత్యత వేగంగా తగ్గుతున్నది. గత మూడేళ్లలో 30 శాతానికి పైగా పడిపోయింది. ప్రస్తుతం ఇండియాలో ఈ పక్షులు సుమారు 2,700 ఉండొచ్చని ఒక అంచనా. ఇవి సాధారణంగా జనాల అలికిడి లేని నది, సముద్రం మధ్యలోని ఇసుక మేటల్లో, ద్వీపాల్లో నివాసం ఏర్పాటు చేసుకుంటాయి. దిగువ మానేరు జలాశయం మధ్యలో పెద్ద బండరాళ్లు, చిన్న చిన్న ద్వీపాలు ఉండటంతో ఇండియన్ స్కిమ్మర్స్ వాటిలో ఆవాసం ఏర్పాటు చేసుకుని మానేరు జలాశయం నీటిలో చేపలు, కీటకాలను ఆహారంగా తీసుకుంటూ జీవిస్తున్నాయి. అరుదైన ఇండియన్ స్కిమ్మర్ పక్షుల సమాచారాన్ని కరీంనగర్ బర్డింగ్ కమ్యూనిటీ(కేబీసీ) వ్యవస్థాపకులు మూటపల్లి గంగాధర్, మధు గోసిక, అబ్దుల్ రహీం, వివేక్ మాత కరీంనగర్ అటవీశాఖ అధికారులకు అందించారు.

న్యూస్ బాక్స్

మీ సేవా నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి

మంథని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మే సేవా సెంటర్ల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మంథని డివిజన్‌మీసేవా ఫెడరేషన్ నాయకులు అట్టెం రాజేందర్, ప్రయాకర్ రావు శ్యాంసుందర్, బండారి రమేష్, పర్వేన సతీష్, పుప్పాల సతీస్, మేడి వెంకటేష్‌లు కోరారు. ఈమేరకు నవంబర్ 4న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సదస్సు పోస్టర్ వారు ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుడూ.. 13 సంవత్సరాలుగా మీసేవా సెంటర్లను నిర్వహిస్తున్న తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సదస్సుకు మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులు హాజరవుతున్నట్లు తెలిపారు.

స్నేహితుల పిల్లలకు ఆర్థిక సాయం

ఎలిగేడు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామానికి చెందిన బుర్ర రమేష్, అతని భార్య రమ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. వారికి హర్షిత, సుచిత అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తల్లిదండ్రులను కోల్పోయి ఉన్న పిల్లలను గుర్తించిన 2003-04 ఎలిగేడు ఉన్నత పాఠశాల ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ స్నేహితులు వారికి అండగా నిలిచారు. వారి చదువులకు రూ.50వేలు అందజేశారు. భవిష్యత్తులో పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అండగా ఉంటామని రమేష్ స్నేహితులు తెలిపారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ముత్తారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ముత్తారంలో ఇటీవల ఉపాధ్యాయుడిగా పని చేసి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్-2024ను అందుకున్న తాడూరి సంపత్ కుమార్‌ను స్థానిక పాఠశాల పూర్వపు ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు ఆదివారం ఘనంగా సన్మానించారు. తనతో పనిచేసిన ఉపాధ్యాయులు, పెద్దలు సంపత్ వ్యక్తిత్వాన్ని, విద్యా సేవలను అందరికి ఆదర్శమని అందరు కీర్తించారు. ఈ కార్యక్రమంలో సహచర ఉపాధ్యాయులు పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సుల్తానాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ సహకార సంఘం పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే విజయరమణారావు చేతుల మీదుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు సొసైటీ సీఈవో బూరుగు సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటలకు కాట్నపల్లి గ్రామంలో కేంద్రాన్ని ప్రారంభించి తర్వాత కోమండ్లపల్లి, నీరుకుళ్ల, గట్టేపల్లి, కదంబాపూర్, శాస్త్రినగర్, పూసాల గ్రామాల్లో కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని వివరించారు. రైతులు తమ ధాన్యాన్ని నిబంధనలు పాటిస్తూ ఆయా కేంద్రాలకు తీసుకురావల్సిందా సీఈవో కోరారు. అలాగే ఈ ప్రారంభోత్సవాలకు రైతులు పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడితే సహించేది లేదు

- రాష్ట్ర ప్రభుత్వ హామీల అమలుకు ఉద్యమ బాట - సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్

జ్యోతినగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు గత 10 సంవత్సరాలుగా ప్రజా, కార్మిక, రైతు వ్యతిరే విధానాలకు పాల్పడుతున్నదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.భూపాల్ ఆరోపించారు. ఆదివారం అన్నపూర్ణకాలనీలో జరిగిన సీపీఎం రామగుండం, ఎన్టీపీసీ సీపీఎం ఏరియా కమిటీ మహాసభకు భూపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చి వ్యవసాయ రంగాన్ని ఎన్‌డీఏ ప్రభుత్వం సంక్షోభంలో నెట్టిందని, రైతులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయక అలుపెరుగని పోరాటం చేసి చట్టాలను ప్రభుత్వం వాపసు తీసుకునేలా చేశారన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన ఏ హామీని మోదీ సర్కారు అమలు చేయడం లేదని, మద్దతు ధరకు దిక్కు లేదన్నారు. కార్పొరేట్ పెట్టుబడి శక్తులకు మద్దతుగా కార్మిక చట్టాలను సవరించి లేబర్ కోడ్లను కేంద్రం తీసుకువచ్చిందన్నారు. కార్మికుల హక్కులు కాలరాసేందుకు, యూనియన్ల మనుగడ లేకుండా చేసేందుకు కుట్ర జరుగుతున్నదన్నారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కమ్యూనిస్టులను అణచివేసేందుకు కుయుక్తులు పన్నుతున్నాడని భూపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో హిందిని బలవంతంగా రుద్దే కుట్ర జరుగుతున్నదన్నారు. దేశంలో ఒకే ఎన్నిక, ఒకే భాషకు సీపీఎం వ్యతిరేఖమని స్పష్టం చేశారు. 6 గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం



మహాసభలో ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్

హామీల అమలులో విఫలమైందన్నారు. మహిళలకు ఉచిత బస్సు తప్ప ఏ హామీ నెరవేరలేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మిగతా ప్రయాణికులు ఇబ్బంది పడుతన్నారని, బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్లను పేదలకు కేటాయించాలని, భూపోరాటాల ద్వారా గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులకు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మహాసభ సందర్భంగా ఏరియా కార్యదర్శి ఎం.రామాచారి కార్యక్రమాల నివేదికను సమర్పించారు. పార్టీ ఏరియా సభ్యుడు గీట్ల లక్ష్మారెడ్డి పార్టీ జెండా ఎగురవేసి సభలను ప్రారంభించారు.

ఈ మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, నాయకులు మహేశ్వరి, వేల్పుల కుమార స్వామి, ఎస్.బిక్షపతి, నాంసాని శంకర్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హిందువుల్లో ఐక్యతకు పంచ పరివర్తన

- ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి సామళ్ల కిరణ్

కోల్‌సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా హిందువుల్లో ఐక్యత కోసం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) పంచ పరివర్తన కార్యక్రమం తీసుకుందని ఆర్‌ఎస్‌ఎస్ కరీంనగర్ విభాగ్ సామళ్ల కిరణ్ పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా హిందువుల్లో ఐక్యతకై కార్యక్రమాలు చేపట్టిందన్నారు. గోదావరిఖని కోదండ రామాలయ ఆవరణలో ఆర్‌ఎస్‌ఎస్ సంఘ పద సంచలనం కార్యక్రమం నిర్వహించారు. కోదండ రామాలయం నుంచి మెయిన్ చౌరస్తా వరకు పద సంచలనం జరిగింది. అనంతరం కోదండ రామాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సామళ్ల కిరణ్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ 99ఏళ్లుగా దేశాన్ని సుదృడంగా తయారు చేయడానికి నిస్వార్థంగా పని చేస్తున్నటువంటి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ఎన్నో త్యాగాలు చేశారన్నారు. వారి త్యాగాల ఫలితంగానే దేశంలో హిందువులు నేను హిందువును అని గర్వంగా చెప్పుకునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లలో అడుగుపెడుతున్న తరుణంలో సంఘ కార్యకర్తలకు దిశానిర్దేశనం చేసేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా హిందువులను ఐక్యం చేయడానికి సంస్థ రాబోయే రోజుల్లో పంచ పరివర్తన పేరుతో కార్య


ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

క్రమం నిర్వహిస్తుందన్నారు. ఇందులో దేశంలో సామాజిక మార్పు, రాజ్యాంగ పరిరక్షణ, ఉమ్మడి కుటుంబ సాంప్రదాయ పరిరక్షణ, పర్యావరణ హితం, సురక్షిత భారత్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. హిందూ సాంప్రదాయాలను, సంస్కృతిని కాపాడే విధంగా ప్రతి హిందువును జాగృతం చేయడం మానవాళి మనుగడకు పర్యావరణాన్ని పరిరక్షించడం, రాజ్యాంగ విధి విధానాలకు లోబడి సురక్షిత భారత్ నిర్మించడం వీటి ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రామకృష్ణప్రసాద్, జిల్లా కార్యవాహ గడ్డి రమేష్, అధిక సంఖ్యలో జేష్ఠ స్వయం సేవకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి వైపు అడుగులు..

(3వ పేజీ తరువాయి)

మారేడుపల్లి, ఉండెడ గ్రామాలు కూడా 'రుడా' పరిధిలోకి వస్తాయి. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ అయ్యింది.

● మౌలిక వసతుల కల్పన..

రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ 'రుడా' ఏర్పాటుతో మౌలిక వసతుల కల్పనకు అవకాశాలు ఏర్పడుతాయి. రోడ్ల అభివృద్ధి, మంచినీటి సరఫరా, సాటిలైట్ టౌన్‌షిప్‌లు, లేఅవుట్‌ల అభివృద్ధి, ఉపాధి అవకాశాల మెరుగుపర్చడం వంటి సౌకర్యాలు కలుగనున్నాయి. వీటితో పాటు ఇండస్ట్రియల్ ఏరియాలు అయిన ప్రాంతాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి వచ్చినందు వల్ల బీ క్యాటగిరి నగరాలుగా గుర్తింపు లభిస్తుంది. తద్వారా హెచ్‌ఆర్‌ఏ, ఇతర సౌకర్యాలు లభిస్తాయి. కేంద్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధికి కేటాయించే నిధులు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ద్వారా వెచ్చించనున్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ పట్టణీకరణలో భాగంగా పట్టణాలు, నగర పరిసర ప్రాంతాల్లో హౌసింగ్, రోడ్ నెట్ వర్కింగ్ తదితర పనులకు నిధులు వెచ్చించనున్నది. రుడా పరిధిలో ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ ఏర్పాటు చేయనున్నారు.

కాంగ్రెస్ పార్టీదే ఘనత : ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రుడా' ప్రకటించారు. మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసన సభ్యులు సహరించడం వల్ల 'రుడా' ఏర్పాటు అయ్యింది. దీనివల్ల ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో సైతం మరింత మౌలిక సదుపాయలు కల్పించేందుకు అవకాశం ఏర్పడుతుంది. రుడా ఏర్పాటుచేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, చొరవ చూపిన మంత్రి శ్రీధర్‌బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు.

మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ కార్మికుల మల్టీపర్పస్ విధానం రద్దుచేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సీపెల్లి రవీందర్ ప్రభుత్వాన్ని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షకార్యదర్శులు సీపెల్లి రవీందర్, ఖాజా మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందికి 2వ పీఆర్సీ వర్తింపచేయాలని, వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, బకాయి వేతనాలు చెల్లించాలని సోమవారం మండల కార్యాలయం ఎదుట చేయనున్న ధర్నా జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ కార్మికుల పర్మినెంట్, వేతనాల పెంపు, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు తదితర డిమాండ్ల సాధనకు రాష్ట్రంలో 34 రోజుల సమ్మె సందర్భంలో కాంగ్రెస్ పార్టీ సమ్మెకు మద్దతు ప్రకటించి సమ్మె టెంట్ల వద్దకు వచ్చి పంచాయితీ కార్మికుల పోరాటానికి అండగా నిలిచిందన్నారు. అధికారం వచ్చాక కార్మికుల సమస్యలు పట్టనట్టు వ్యవహరించడం సరైంది కాదని అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం సంఉదించి మల్టిపరఁస్ విధానం రద్దు చేయకుంటే నవమార్ వచేనెల 4, 5 తేదీల్లో 48గంటల దీక్షలు చేపడుతామన్నారు. అనంతరం సమ్మెకు వెళ్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నాయకులు మామిడిపల్లి తిరుపతి, జంగపెల్లి నరేష్, ఆశోక్, ముస్తాఫ కార్మికులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం, కోడె మొక్కు క్యూలైన్‌ల ద్వారా ఆలయంలో ప్రవేశించి పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయంలోని పలు విభాగాలను పరిశీలించారు.

వాలీబాల్ క్రీడాకారుడికి డాక్టరేట్ ప్రదానం

సుల్తానాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుల్తానాబాద్ మండలంలోని నర్సయ్యపల్లి గ్రామానికి చెందిన జూపల్లి తిరుమల్‌రావుకు అరుదైన గౌరవం దక్కింది. ఆదివారం కర్నాటకలోని హోసూర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తిరమల్‌రావును సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వైస్‌చైర్మన్‌గా నియమించారు. డాక్టరేట్‌ను కూడా ప్రదానం చేస్తూ నియామక పత్రాన్ని అందించి ఘనంగా సన్మానించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వాలీబాల్ అసోసియోషన్ అధ్యక్షులుగా కొనసాగుతున్న సీనియర్ క్రీడాకారుడు జూపల్లి తిరుమల్‌రావు పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సేవలను గుర్తించిన తమిళనాడులోని హోసూర్‌లో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్శిటీ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు తిరుమల్‌కు శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు.



పురస్కారం అందజేస్తున్న అకాడమీ ప్రతినిధులు

ఎన్‌సీసీ కేడెట్లను అభినందించిన ఎమ్మెల్యే

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల హిమాచల్‌ప్రదేశ్, అరకు, ఊటీ ప్రాంతాల్లో జరిగిన ట్రెక్కింగ్ సాహస యాత్రలో ప్రతిభ కనబర్చిన గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ కేడెట్లను ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అభినందించారు. చిన్నవయస్సులోనే హిమాచల్ ప్రదేశ్‌లోని మౌంట్ పటాల్స్ 1400 మీటర్లు 12 గంటల వ్యవధిలో పూర్తిచేసిన ఎం.అమృత్‌సాయిని ఎమ్మెల్యే సన్మానించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అరకు ట్రెకింగ్‌లో పాల్గొన్న ఎన్.అచ్యుతనంద, పి.కార్తీక్, కె.రాజ్ కుమార్, కె.సాయిచరణ్, తమిళనాడు ఊటీ ట్రెకింగ్‌లో ఎస్.రితిక్‌శ్రీ, ఎ.సాధ్వి యాదవ్, టి.శౌర్య, శ్రీనర్తన ఎన్‌సీసీ ఫస్ట్‌ఆఫీసర్ జ్యోత్స్నలను ఎమ్మెల్యే అభినందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కునారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986లో పదవ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులకు బోధించిన అప్పటి ఉపాధ్యాయులు దండ నరసింహారెడ్డి, వెంకటయ్య సత్యనారాయణ, ప్రకాశం, గోపాల్‌రెడ్డిలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదివి వివిధ స్థాయిలలో స్థిరపడిన వారు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గ్రామంతోపాటు పాఠశాల అభివృద్ధికి కృషిచేస్తామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు..

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

రామగిరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మారు పేర్ల విజిలెన్స్ పెండింగ్ కేసులు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఆర్జీ-3 డివిజన్ పర్యటనలో ఉన్న సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌కు బాధితులు వినతి పత్రం అందజేశారు. ఎన్నో సంవత్సరాలుగా సింగరేణికి సేవలు అందించి అనారోగ్య కారణంగా మెడికల్ ఇన్‌వాలిడేట్ అయి సంవత్సరాలు గడుస్తున్నా డిపెండెంట్లైన తమకు విజిలెన్స్ పెండింగ్ పేరిట సింగరేణిలో ఉద్యోగ అవకాశం కల్పించడం లేదని బాధితులు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో పొన్నం బాలకృష్ణ గౌడ్, బొద్దుల రంజిత్‌కుమార్, మాచర్ల నవీన్‌కుమార్, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

సింగరేణి ఖ్యాతిని పెంచిన ఓసీపీ-1

- గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-1 ప్రాజెక్టు గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఆదివారం ప్రాజెక్టు ఆవరణలో ఘనంగా జరిగాయి. 50 ఏళ్ళు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పైలాన్‌ను ముఖ్య అతిథిగా హాజరైన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ సింగరేణి సీఎండీ బలరాంతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మక్కాన్‌సింగ్ మాట్లాడారు. సింగరేణిలో మొదటి ఓపెన్‌కాస్ట్‌గా ప్రారంభమై 50 వసంతాలు పూర్తిచేసుకున్న ప్రాజెక్టుగా ఓసీపీ-1 నిలవడం సంతోషకరమైన విషయమని, సింగరేణిలోని ఇతర ప్రాజెక్టులకు ఓసీపీ-1 ఆదర్శంగా నిలిచి సంస్థ ఖ్యాతిని ఇనుమడింపచేసినట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. క్రమశిక్షణ, నైపుణ్యంతో కార్మికులు పనిచేయడంతో ప్రాజెక్టు బొగ్గు ఉత్పత్తిలో రికార్డులు సాధించినట్టు తెలిపారు. సింగరేణిని బలోపేతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినట్టు మక్కాన్‌సింగ్ తెలిపారు. కొత్త ప్రాజెక్టుల ప్రారంభించడంతో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే చర్యలు తీసుకోనున్నట్టు, కార్మిక వాడల్లో మౌలిక సదపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు సరిపడా బొగ్గు ఉత్పత్తి చేస్తూ సింగరేణి అభివృద్ధిలో తనవంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నదని, అటువంటి సంస్థను కాపాడుకోవడం అందరి బాధ్యత అని అన్నారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్(పా) వెంకటేశ్వరరెడ్డి, ఆర్జీ రీజియన్ జీఎంలు లలిత్‌కుమార్, సూర్యనారాయణ, సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ కొరివి రాజ్‌కుమార్, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌తో పాటు అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే, సీఎండీ

క్వార్టర్ల అలాట్‌మెంట్‌లో సీనియర్లకు అన్యాయం : హెచ్‌ఎంఎస్

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలో జరుగుతున్న క్వార్టర్ల కేటాయింపులో అర్హులైన సీనియర్ కార్మికులకు అన్యాయం జరుగుతున్నట్టు హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సిలింగ్ జాబితాలో క్వార్టర్ నంబర్లు పొందుపరచకుండా ప్రతి కౌన్సిలింగ్‌లో ఐదు, ఆరు క్వార్టర్లను స్పెషల్ కోటా అని చెప్పి జూనియర్లకు అలాట్ చేస్తున్నట్టు రియాజ్ తెలిపారు. డైరెక్టర్లు, రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకు అలాట్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. క్వార్టర్ నంబర్ టీటూ- 43 క్వార్టర్‌ను పైరవీలకు ఆస్కారం లేకుండా జాబితాలో పెట్టి అర్హులకు మాత్రమే కేటాయించాలని చెప్పినా, స్పెషల్ కేసు అని జూనియర్‌కు క్వార్టర్ కేటాయించినట్టు తెలిపారు. జూనియర్లకు డిప్యుటేషన్ కింద సర్వేస్‌కు పంపడం, తప్పుడు యాక్టింగులు రాసి జూనియర్లకు ప్రమోషన్లు ఇస్తుండడంతో సీనియర్ కార్మికులకు అన్యాయం జరుగుతున్నట్టు తెలిపారు. జీఎంతో పాటు ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా పద్ధతి మర్చుకోకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నట్టు ఆరోపించారు. ఇది సరైన పద్ధతి కాదని రియాజ్ పేర్కొన్నారు.

పార్టీని నమ్ముకొని పనిచేస్తేనే గుర్తింపు..

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్

సుల్తానాబాద్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): పార్టీలో దశాబ్దాల తరబడి కార్యకర్త స్థాయి నుంచి నమ్మకంగా పని చేస్తున్న వారికి ఏదో సందర్భంలో తగిన గుర్తింపు తప్పకుండా వస్తుందని గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్ అన్నారు. సుల్తానాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం పలువురు జిల్లాస్థాయి నాయకులు అన్నయ్య గౌడ్‌ను సన్మానించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన సందర్భంను పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఆదివారం కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, పోచన్న, మెంగని శ్రీనివాస్, సాదుల కరుణాకర్, తిరుమల, కొట్టె శ్రీనివాస్, శ్రీగిరి సుధాకర్, ఆసిఫ్, సలీం, టీకే రాజు, తదితరులు కలిసి సన్మానించారు. అలాగే కరీంనగర్ పట్టణం వాకర్స్ అసోసియేషన్ ప్రతినిదులు కుమారస్వామి, ఎల్లాగౌడ్, సుధాకర్‌రావు, జగదీశ్వర్, రమణారెడ్డి, భారతి, రాజు, రవి తదితరులు కూడా సన్మానించారు. ఈ సందర్భంగా అన్నయ్య గౌడ్ మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు పార్టీలో కష్టపడి పని చేస్తున్నారని, ఈ ప్రభుత్వంలో వారికి తప్పకుండా మంచి అవకాశాలు వస్తాయన్నారు.

'రుడా'తో ప్రణాళికాబద్ధంగా పట్టణాభివృద్ధి, మౌళిక వసతుల కల్పన..

మంథని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా)లో మంథని మున్సిపాలిటీతో పాటు డివిజన్‌లోని మంథని, కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం మండలాలను సైతం విలీనం చేయటానికి జీవో నంబరు 165ద్వారా ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. పట్టణ, చుట్టూ పక్కల గ్రామాల్లో సైతం సమగ్రాభివృద్ధితో పాటు ప్రణాళికాబద్ధంగా ప్రజలకు రోడ్లు, హౌజింగ్, తాగునీరు, వైద్యం, విద్యుత్ సరఫరాలాంటి మౌళిక సదుపాయాల, నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రుడాలో మంథని డివిజన్‌లోని గ్రామాలను, మున్సిపాలిటీ పరిధిని చేరుస్తూ నోటిఫికేషన్‌ను మున్సిపల్ శాఖ కార్యదర్శి దాన కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న మంథనిని 2018లో అప్పటి ప్రభుత్వం 13 వార్డులతో మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ చేసింది. 6సంవత్సరాలుగా మున్సిపల్‌గా కొనసాగుతున్న మంథనితోపాటు, డివిజన్‌లోని 4మండలాల్లోని గ్రామాలన్నింటిని ప్రభుత్వం తాజాగా ఏర్పాటు చేసిన రుడా పరిధిలోకి తీసుకురావటానికి నోటిఫికేషన్ జారీ చేశారు. రుడా ఏర్పాటుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మున్సిపాలిటీ, డివిజన్‌లోని వివిధ మండలాల్లోని గ్రామాలను అర్బన్, సెమీఅర్బన్‌ప్రాంతాలుగా అభివృద్ధి చేయటానికి నేరుగా ప్రత్యేక నిధులు విడుదలయ్యే అవకాశంతోపాటు రుడా పరిధిలో ఉన్న భారీ పరిశ్రమలు సింగరేణి, ఎన్టీపీసీ, బసంత్‌నగర్, ఎఫ్‌సీఐ లాంటి అనేక సంస్థల నుంచి సీఎస్‌ఆర్ నిధులు అత్యధికంగా నిధులు ఖర్చు చేసే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. పరిపాలనపరంగా రుడాకు ప్రత్యేక అధికారాలు ఉండటంతో మున్సిపల్, మండలాల్లోని గ్రామాలు అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాలుగా శరవేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్నట్లు అందరు భావిస్తున్నారు.

వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న నూతన కార్యవర్గం, సభ్యులు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. జిల్లా వాకర్ అసోసియేషన్ కోఆర్డినేటర్ అన్నెడి వెంకటరెడ్డి అధ్యక్షకార్యదర్శులు కొట్టె లక్ష్మయ్య, చింతపండు రాజమల్లుతోపాటు మొత్తం కార్యావర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించిన అనంతరం ఆయన మాట్లాడారు. వాకర్ సభ్యులు స్నేహభావంతో మెదులుతూ సమాజ సేవా కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. వాకింగ్ ట్రాక్ గురించి అధికారులతో కలిసి డెవలప్మెంట్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు కొట్టే లక్ష్మయ్య, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 303 ఏరియా వైస్‌ప్రెసిడెంట్ టి. కుమారస్వామి, గవర్నర్ పి ఎల్లగౌడ్, కే భారతి, ఉమ్మడి జిల్లా ఏరియా కోఆర్డినేటర ఏ. సుధాకర్‌రావు, డిప్యూటీ గవర్నర్ బి జగదీశ్వర్ గౌడ్, కార్యదర్శి రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.